నేటి దినపత్రిక
18వ వసంతంలోకి
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శనివారం 1 ఫిబ్రవరి 2025 పేజీలు 8

ఉపాధి కూలీలకు

# రూ.300 అందాల్సిందే..



- క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సరైన ప్రణాళికతో వ్యవహరించాలి
- క్రమశిక్షణ రాహిత్యం కనిపిస్తే ఉపేక్షించను
- ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలన్నీ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలి
- తడి-పొడి చెత్త సేకరణ, నిర్వహణ సరైన విధంగా జరగాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 31, మేజర్ న్యూస్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు దినసరి సగటు వేతనం రూ. 300 హక్కుగా పొందేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సరైన ప్రణాళికతో పనులు చేపట్టేలా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ ఆర్‌డీవోలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లుతో ఉపాధి హామీ పథకం, చెత్త నుంచి సంపద 2

# తెల్లవారుజామునే తనిఖీలు



- పారిశుధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించిన కృష్ణాజిల్లా కలెక్టర్
- పలుచోట్ల తడి పొడి చెత్త వేరు చేయకపోవడంపై ఆగ్రహం
- సుందర మచిలీపట్నంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనుల ఆకస్మిక తనిఖీ, పర్యవేక్షణలో భాగంగా వరుసగా శుక్రవారం కూడా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెల్లవారుజామునే తనిఖీలు నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్‌లో 2లో



## రెండో రోజూ కొనసాగిన ఎమ్మెల్యే ప్రజాభిప్రాయ సేకరణ

వివరాలు 8లో...

ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు

## ఆటో డ్రైవర్ బలి

ఫేస్బుక్లో ఆటో డ్రైవర్ సూసైడ్ నోట్



(ఫైల్ ఫోటో)

2

ఫైనాన్స్ వేధింపుల వల్లే చనిపోయాడు

జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్

# లక్షల మందిని విద్యకు దూరం చేసింది జగనే

- ఎన్డీయే కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.788 కోట్లు
- విద్యార్థుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు
- విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులకు మంత్రి లోకేష్ శ్రీకారం
- ప్రచార ఆర్భాటం కోసం చేసే ఫీజు పోరు అట్టర్ ఫ్లాప్



**విజయవాడ జనవరి 31, మేజర్ న్యూస్ :** గతంలో విద్యార్థుల తరఫున పూర్తిగా ఫీజులు కళాశాల యాజమాన్యాలకే ప్రభుత్వం నేరుగా అందజేసేందని టీఎన్ఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్ పేర్కొన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలో వచ్చిన జగన్ విద్యార్థుల జీవితాలను జగనన్న విద్యా దీవెన పేరుతో అంధకారంగా మార్చారని మండిపడ్డారు. ఫిబ్రవరి 5వ తేదీన వైసిపి నాయకులు తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ, ఫీజు పోరు పోస్టర్ రిలీజ్ సందర్భంగా వైసిపి మాజీ మంత్రులు విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం గురునానక్ కాలనీ విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్ మాట్లాడుతూ, ప్రచార్బాటంతో విద్యా దీవెన అంటూ విద్యార్థుల్ని, వారి తల్లితండ్రుల్ని మోసం చేశాడని, 2014-2019 టీడీపీ పాలనలో ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్‌మెంట్ చేస్తే జగన్ రెడ్డి పాలనలో కేవలం 9 లక్షల మందికి అది కూడా విడతల వారీగా ఇచ్చి, దాదాపు 7 లక్షల మంది పేద విద్యార్థులకు మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## తెల్లవారుజామునే తనిఖీలు

రాజుపేట, నేషనల్ కాలేజీ రోడ్డు, నాగ పోతురాజు సెంటర్, డంపింగ్ యార్డ్ ప్రదేశాలలో ఆకస్మిక తనిఖీలు చేసి పారిశుధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించారు. పలుచోట్ల తడి పొడి చెత్త వేరు చేయకుండా ఒకే డస్ట్ బిన్‌లో వేయడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేసి స్వయంగా అవగాహన కల్పించారు. అధికారులు కూడా ప్రజలకు తడి,పొడి చెత్త పై అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ ఇంటింటికి వెళ్లి నివాసితులతో మాట్లాడి తడి, పొడి చెత్త వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ వద్ద కూడా తడి, పొడి చెత్తను వేరు చేసే పని చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. తరచుగా వ్యర్థాలు వేసే ప్రదేశాలను ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు తరలించి శుభ్రపరచాలన్నారు. డ్రైనేజీలను,రహదాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రతవలె పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ నగరాన్ని ఆహ్లాదకర, సుందర మచిలీపట్నంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, పారిశుధ్య నిర్వహణ ప్రత్యేక నోడల్ అధికారులు గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానంద పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లక్షల మందిని విద్యకు దూరం చేసింది జగనే

విద్య దూరం చేసిన దుర్మార్గుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. వైసిపి నాయకులందరూ "ఫీజుపోరు" లో జగన్ ఐదేళ్లలో పెట్టిన బకాయిల కుప్ప గురించి వివరించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా కాలేజీలకే నేరుగా ఫీజులు చెల్లించే విధానాన్ని మార్చేసి తల్లుల ఖాతాలకే అంటూ తన రాజకీయ అవసరాల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. పేద విద్యార్థులకు చదువు, ఉద్యోగాలు రాజశేఖర్ రెడ్డి పెట్టిన భిక్ష అంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను భిక్షగాళ్లతో పోలుస్తూ మాట్లాడిన వైసిపి నాయకులు ముందుగా క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ప్రజలను, విద్యార్థులను గౌరవించటం తెలియని వైసీపీ నేతలకు అసలు నాయకులుగా కొనసాగే అర్హత లేదన్నారు. ఇవ్వని ఫీజులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ - రూ.2,832 కోట్లు ఇచ్చినట్లు ప్రకటనలు ఇచ్చుకుని బాకా కొట్టుకుంది ఎవరూ? అంటూ ప్రశ్నించారు. వసతి దీవెన బకాయిలు - రూ.989 కోట్లు, పీజీ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ - రూ.450 కోట్లు బకాయిల కుప్పపెట్టి ఆ సొమ్మంతా దోచుకున్న నాయకులు విద్యార్థుల జీవితాలతో ఆడుకోవటానికి ఫీజు పోరు అంటూ మరో కొత్త డ్రామాకి తెరదీశారన్నారు. వైసిపి నాయకులు ఉనికి కోసం చేసే దొంగ పోరులను ప్రజలు, విద్యార్థులు నమ్మటానికి సిద్దంగా లేరని తెలిపారు. ఇటీవల వైసిపి చేసిన రైతు పోరు అట్టర్ ఫ్లాప్ అయినా వై.ఎస్.జగన్ కి ఇంకా బుద్ది రాలేదన్నారు. ఫీజు పోరు కూడా అంతకు మించి అట్టర్ ఫ్లాప్ కానుందన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో రూ.788 కోట్ల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేసిందన్నారు.. విద్య శాఖ మంత్రి నారా లోకేష్ పదవీ బాధ్యతులు చేపట్టిన తర్వాత వివిధ కళాశాలల్లో నిలిచిపోయిన 10లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర టి.ఎన్.ఎస్.ఎఫ్ నాయకులు వడ్లమూడి వంశీ, సాయిరాము, రవి, బాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మాన సతీష్‌కు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులు



**నందిగామ, జనవరి 31, మేజర్ న్యూస్:** పట్టణం లోని పాత బైపాస్ గ్యాస్ కంపెనీ రోడ్డులో శుక్రవారం ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి ధర్మాన సతీష్ పార్థివదేహాన్ని సందర్శించి పులమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు రూ. 300 అందాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

సృష్టి కేంద్రాలు, పెన్షన్ల పంపిణీ తదితరాలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులకు సరైన అవగాహన కల్పించి, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.300 లభించేలా డ్వామా అధికారులు, ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పని మార్కింగ్, మస్టరింగ్ విషయాల్లో స్పష్టమైన అవగాహనతో వ్యవహరించాలన్నారు. పటిష్ట పర్యవేక్షణ అవసరమని అప్పుడే లక్ష్యాలను చేరుకునేందుకు వీలవుతుందన్నారు. విధుల నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే ఉపేక్షించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. 286 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 264 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. కేంద్రాలు లేని 22 గ్రామ పంచాయతీల్లో వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తిచేసి, నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాలను రహదారితో అనుసంధానం చేసి ఫెన్సింగ్‌తో పాటు వర్మీ సీడింగ్ జరిగేలా కృషిచేయాలన్నారు.

**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై ప్రత్యేక దృష్టిపెట్టండి:**

గ్రామ పంచాయతీల్లో ప్రతి వెయ్యిమందికి ఒక క్లాప్ మిత్ర ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అమలుకు చొరవచూపాలని, 100 శాతం తడి, పొడి చెత్తను సేకరించేలా చూడాలన్నారు. అవగాహన శిబిరాల నిర్వహణ, చెత్తనుబట్టి వేర్వేరుగా సేకరించడం, బిన్స్‌ను అందుబాటులో ఉంచడం వంటివి చేయాలన్నారు. అదేవిధంగా హౌస్‌హోల్డ్ డేటాబేస్ సర్వేలో భాగంగా గృహాల జియోట్యాగింగ్, డేటా అనుసంధాన ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలి**

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, ఉదయం 6 గంటలకు పంపిణీని ప్రారంభించి, మొదటిరోజే పూర్తిచేసేందుకు కృషిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2,29,913 పెన్షన్లకు రూ. 98.20 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. టెలీకాన్ఫరెన్స్‌లో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.రాము, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు ఆటో డ్రైవర్ బలి



(ఫైల్ ఫోటో)

**గుడివాడ, మేజర్ న్యూస్:** ఆటో ఫైనాన్స్ కంపెనీ వారి వేధింపులు తాళలేక ఓ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుడివాడ మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే గుడివాడ మండలం మోటూరు గ్రామానికి చెందిన రావి సత్తిబాబు (35) ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ. 7.80 లక్షల రుణం తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రతి నెల 5న కిస్తీ కట్టాలి. కానీ ఈ నెల 25 వరకు చెల్లించలేదు. తనకు ఆరోగ్య సమస్యల కారణంగా ఆలస్యమవుతుందని చెప్పినా ఫైనాన్స్ కంపెనీ వారు వినలేదు. తన ఇంటిని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారని, దీనిపై ఎలాంటి లావాదేవీలు చెల్లవని ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ఇంటి గోడపై నోటీసు అంటించారు. పైగా ఆటో స్టాండుకు గురువారం వెళ్లి నానా రభస చేశారు. దీంతో ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక ఆటో డ్రైవర్ ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు.

**నా చావుకు కారణం...**

నా భార్యకు ఆరోగ్యం బాగోలేక ఆటో కిస్తీ చెల్లింపు ఆలస్యమైంది. ఒక నెల సమయం ఇవ్వాలని కోరాను. అయినా వినలేదు. నా చావుకు కారణం విస్తార్ ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు, గుడివాడ శాఖ మేనేజర్ పి. సుధాకర్, క్రెడిట్ మేనేజర్ భవాని, వారి వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుంటున్నాను, నా కుటుంబానికి న్యాయం చేయండి. భార్య, పిల్లల పేర్లు, అమ్మ, నాన్న, అన్నయ్య పేర్లు రాసి మిస్ యూ అంటూ ఫేస్ బుక్ లో పోస్టు కూడా చేశాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

**తనకూ, తన పిల్లలకు న్యాయం చేయాలి భార్య పద్మావతి వేడుకోలు**

ఈ నెల 28న ఫైనాన్స్ కంపెనీ వారు తమ ఇంటికి వచ్చి కిస్తీ చెల్లించే వరకూ వెళ్లేదిలేదని సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఇంటి నుంచి కదలలేదు. నా భర్త ఇంట్లో లేరు, రాగానే ఫోన్ చేయిస్తానని చెప్పినా వినలేదు. ఇంటికి తాళాలు వేస్తామని గోలచేశారు. మోటూరు ఆటో స్టాండులో కూడా అల్లరి చేశారు, గురువారం ఆటో స్టాండుకు వెళ్లి వేధించారు. నా ఆరోగ్యం బాగోలేక గురువారం మచిలీపట్నం ఆసుపత్రికి వెళ్లాను. ఈ క్రమంలో ఫేస్ బుక్‌లో చనిపోతున్నానని పోస్టు పెట్టి ఇంట్లో చీరతో ఉరేసుకొని తన భర్త చనిపోయాడని పద్మావతి కన్నీటి పర్యంతామవుతుంది. ఇద్దరు చిన్న పిల్లలను ఎలా సాకాలోనని విలపిస్తుంది. నా పిల్లలు, కుటుంబానికి న్యాయం చెయ్యాలని వేడుకుంటుంది.

## ఫైనాన్స్ వేధింపుల వల్లే సత్తిబాబు చనిపోయాడు
## జనసేన ఇన్ఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్



**గుడివాడ, మేజర్ న్యూస్:** ఆటో ఫైనాన్స్ వారి వేధింపుల వల్లే జనసేన సానుభూతిపరుడైన సత్తిబాబు చనిపోయాడని పార్టీ ఇన్ఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. మోటూరుకి చెందిన సత్తిబాబు జనసేన సానుభూతిపరుడని, కుటుంబ ఖర్చులు నిమిత్తం ఫైనాన్స్ ద్వారా రూ.7 లక్షలు ఋణం తీసుకున్నాడన్నారు. ఫైనాన్స్ వారు మానసికంగా ఇబ్బందులకు గురి చేయడం వల్ల సత్తిబాబు సూసైడ్ చేసుకున్నాడని, విస్తారా ఫైనాన్స్‌వారు లోను రద్దు చేయాలని డిమాండ్ చేసారు.

## సీఎం చంద్రబాబు ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే కుమార్తె అలన జ్యువల్



**పామర్రు జనవరి 31 మేజర్ న్యూస్ :** విదేశాలలో ఉన్నత చదువులు చదవడం కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మనవరాలు, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కుమార్తె అయిన వర్ల అలన జ్యువెల్ మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. తన తాత రామయ్య తండ్రి కుమార్ రాజా లతో కలిసి పార్టీ కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి ఆశీస్సులు తీసుకుంది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ఆమెను అభినందించి ఉన్నత విద్యాభ్యాసం చేయటం ద్వారా మన రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేయాలని సూచించారు.



## నిరాశ్రాయులకు నిత్యవసర వస్తువులు, సామాగ్రిని అందజేసిన ఆర్కే

**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ మందపాడులోని నిరాశ్రాయుల కేంద్రం లోని వృద్ధులకు నిత్యవసర వస్తువులు, వృద్ధులకు ఉపయోగపడే వీల్చైర్ ను బిజెపి పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అనే నినాదంతో గుడివాడ పట్టణంలో ఆకలిగి ఉన్న వారికి అన్నం పెడుతూ, సమాజంలో ప్రతి ఒక్క మనిషి సహాయం చేయాలన్న ఆలోచనతో వృద్ధులు కావలసిన వీల్ చైర్, బెడ్, నిత్యవసర సామాగ్రిని అందజేశామన్నారు. పట్టణంలోని యువత రోజుకి కనీసం ఒక గంట అయినా సరే సమాజం కోసం పాటుపడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదరణ సేవా ఫౌండేషన్ చైర్మన్ బోనం గోపిక, రీటా, హంసలేక, రాంబాబు, చరణ్, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

# శోభాయమానంగా వాసవి అమ్మవారికి గ్రామోత్సవం




అవనిగడ్డ, మేజర్ న్యూస్ : ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవనిగడ్డ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు కొల్లిపర్ర రాధాకృష్ణ, కోడూరు పవన్ ఆధ్వర్యంలో అమ్మవారి చిత్రపటంతో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అవనిగడ్డ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు ప్రస్తుత ఉపముఖ్యమంత్రి ఆరోజే ప్రకటించడం జరిగిందని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున చంద్రబాబు నాయుడుపెనుగొండలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందని అన్నారు. గ్రామోత్సవంలో దారి పొడవునా ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. అనంతరం సాలిపేట శ్రీ కోదండ రామాలయం లో నూతనముగా నిర్మితమవుతున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి కి ప్రత్యేక హోమములు నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు దేసు శేషగిరిరావు, దేసు రాము తదితరులు హోమ కార్యక్రమములో పాల్గొన్నారు

# ముగిసిన హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం




అవనిగడ్డ, మేజర్ న్యూస్ : ప్రాచీన వైష్ణవాలయం గా పేరుపొందిన స్థానిక గాలి గోపురం లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయ ఆవరణలో గత 108 రోజులుగా నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం శుక్రవారం వైభవంగా ముగిసింది. ఆంజనేయ స్వామి వారికి లక్ష నాగవల్లి అర్చనలతో (తమలపాకులతో) ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుండి స్వామివారికి పంచామృతాలతో ఆగమపండితులు దీవి రఘు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత స్వామివారిని గ్రామ పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నాగవల్లి అర్చనలతో న్యాయవాది సనక రఘురాం ప్రసాదు. తుంగల సుధాకర్ బాబు. రెడ్డొతు రామ్మోహన్రావు. శ్రీహరిబాబు దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసంతర్పణ కార్యక్రమంలో దాదాపు 6 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించేవారు. కార్యక్రమ ప్రధాన నిర్వాహకుడు చిట్టా ప్రసాద్, అన్నపురెడ్డి హిమగిరి ప్రసాద్. తోట శ్యామ్ కిషోర్ నాయుడులు భక్తులు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## అధ్వానంగా కీసర గండేపల్లి రోడ్డు

కంచికచర్ల జనవరి 31 మేజర్ న్యూస్ : కీసర జాతీయ రహదారి నుండి గండేపల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది .రోడ్డుపై మురుగునీరు వరదల ప్రవహిస్తుంది. ఈ రోడ్డు గండేపల్లి నుండి జమ్మవరం వరకు ఉంటుంది. ప్రధానంగా కీసర గండేపల్లి మధ్య ఈ రోడ్డు కు ఇరువైపులా ఉన్న నివాస గృహాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దుర్వాసన వలన ఇళ్లలో ప్రజలు ఉండలేని పరిస్థితి దాపురించింది. వాహనాలు వెళ్ళేటప్పుడు ఈ మురుగునీరు రోడ్డు కిరువైపులా చిందుతున్నందున పాదచారులు సైతం ఇబ్బందులు పాలవుతున్నారు. ఇండ్ల గోడలు మురుగునీటితో పాడైపోతున్నాయి. కీసర నుండి గండేపల్లి వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులకు నరకం కనిపిస్తుంది. ఈ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో రోడ్డు పై మురుగునీరు ప్రవహిస్తుంది. ప్రజాప్రతినిధులు,అధికారులు ఈ రోడ్డు వైపు తొంగి చూసిన దాఖలాలు లేవు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఊళ్లో రోడ్డు పరిస్థితి ఎలా ఉంటే ఇక లోపల ఉన్న గ్రామాలలో రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుంది అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. మురుగునీటి పారుదల అవుట వలన రోడ్డు ఛిద్రమవుతున్నాయి, ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డు పరిస్థితిని గమనించి మరమ్మత్తులకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

## ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం



ఏ.కొండూరు, మేజర్ న్యూస్: జీటీడబ్ల్యు స్కూల్ నందు ఎంపీపీయస్ లక్ష్మీపురంలో ఎస్జీటీగా పనిచేస్తున్న యస్. సత్యనారాయణ ప్రసాద్ మాస్టారు పదవి విరమణ కార్యక్రమ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కేశవరావు మాట్లాడుతూ సత్యనారాయణ ప్రసాద్ మాస్టారు మండలంలో 16సంవత్సరాలు వృత్తిరీత్యా ఉద్యోగ బాధ్యతలు ఎంతో అంకితభావంతో నిర్వహించి ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లగాను, ఇంజనీర్లగాను తీర్చిదిద్దారని ప్రశంసించారు. పులువురు ఆయన వృత్తిపట్ల ఉన్న అంకితభావాన్ని కొనియాడారు. ఈకార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు, బంధు మిత్రులు, వెంకటతండా పూర్వ విద్యార్థుల తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏ మాట కా మాటే...సీయం చంద్రబాబు అడ్మినిస్ట్రేటరే...



వయస్సు ఆయనకు ఆటంకం కాదు...

రాష్ట్రాభివృద్ధి కోసం పరితపించే ఏకైక నేత

ఆయన పై అవాకులు చవాకులు సభ్యత కాదు

మాజీ ఎమ్మెల్యే డి వై దాసు స్పష్టీకరణ

పామర్రు జనవరి 31 మేజర్ న్యూస్: ఏ మాట కా మాటే చెప్పుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిజంగా అడ్మినిస్ట్రేటరేనని పామర్రు మాజీ ఎమ్మెల్యే డి వై దాసు పేర్కొన్నారు. ఆయనకు వయసు ఏమాత్రం అడ్డంకి కాదని రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే ఏకైక నేత చంద్రబాబు నాయుడన్నారు. ఆయన్ను విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు సరికాదన్నారు. ఆయనపై అవాకులు, చవాకులు ఏమాత్రం సభ్యత కాదన్నారు. ఈ మేరకు శుక్రవారం డివైదాస్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మన దేశంతో పాటు రాష్ట్రాల్ని పాలించిన వారిలో ఎంతోమంది వయస్సును లెక్కచేయకుండా ప్రధాని, ముఖ్యమంత్రి పదవులు నిర్వహించారన్నారు. పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్ తో పాటు నేటి ప్రధాని నరేంద్ర మోడీ ఏడు పదులు దాటిన వయసులో బాధ్యతలు చక్కబెట్టలేదా అన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రులు గా పశ్చిమ బెంగాల్ లో జ్యోతి బసు, తమిళనాడులో కరుణానిధి మన ఉమ్మడి రాష్ట్రంలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, ఎన్టీ రామారావు, కొణిజేటి రోశయ్య తదితరులు వయోభారంతోనే ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించారన్నారు. వారందరితో పోల్చితే చంద్రబాబు నాయుడు చాలా బెటర్ అన్నారు. ఆయనకు మంచి విజన్ ఉందని, రాష్ట్రాభివృద్ధిని ఆకాంక్షించే ఏకైక నేతగా ప్రజల్లో చంద్రబాబు కు మంచి పేరు ఉందన్నారు. ఫలితంగానే నాలుగో విడత ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు, విభజన తర్వాత నవ్యాంధ్ర ప్రదేశ్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా పని చేస్తూ తనకంటూ ప్రత్యేకముద్ర సొంతం చేసుకున్నారన్నారు. మన రాష్ట్రంలో రెండు పర్యాయాలకు మించి ఎవ్వరు ముఖ్యమంత్రిగా పనిచేయలేదన్నారు.చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు రాజభవన్ కు వెళ్లి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అరుదైన నేతగా సరికొత్త రికార్డు సృష్టించారన్నారు. అలాంటి నాయకుడు పట్ల సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తూ పోస్టులు పెట్టడం ఏమాత్రం సరి కాద న్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పాటు పడే ముఖ్యమంత్రి పట్ల అవాకులు, చవాకులు పేలడం సభ్యత సంస్కారం కాదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సంక్షేమ పథకాల అమలు కొంత జాప్యం అవుతుందని ఆ విషయాన్ని దాచి పెట్టకుండా ప్రజలకు విడమర్చి తెలియపరచడం సియం చంద్రబాబు పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. దానిని వాతప్పుగా చూడకూడదన్నారు. ఏళ్ల తరబడి అప్పుల ఊబిలో కూరుకు పోతున్న రాష్ట్రాన్ని పైకి తీసుకురావాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడం తప్పదన్నారు. అంతమాత్రానికే గాబరా పడిపోయి ఆయనపై అబాండాలు వేయడం సరి కాదన్నారు. రాజకీయాల కోసం మనుషులను చులకన చేయకూడదన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నియామకాల విషయాల పట్ల సోషల్ మీడియా వింతగా ప్రవర్తిస్తుందన్నారు. పూటకో వేషం పేటకో మాట మాట్లాడే అనేకమంది నాయకులు మాదిరిగా చంద్రబాబు నాయుడు శైలి వుండదన్నారు. ఆ పాలసీ ఆయనకు భిన్నంగా ఉంటుందన్నారు. ఇదంతా ప్రజలకు తెలిసినప్పటికీ ఆయన్ను అల్లరి చేయాలనే దురుద్దేశంతో వయస్సు అయిపోయిందని విమర్శలు చేయడం, హామీలు అమలు చేయడం లేదని సోషల్ మీడియాలో గగ్గోలు పెట్టడం ప్రజలకు రుచించడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలంలో ఇప్పటికే కొన్ని హామీలు అమలు చేశారని, ఇంకా కొన్ని హామీలు అమలు చేయాల్సి ఉందన్నారు. వాటికి అవసరమైన నిధులు సమకూర్చుకుని తదుపరి మిగిలిన హామీలు అమలు చేస్తామని చెప్పారని దానిని భూతద్దంలో చూపిస్తూ సీఎం చంద్రబాబుపై కొందరు అడ్డగోలు విమర్శలు చేయడం రాష్ట్ర ప్రజలు అంగీకరించడం లేదన్నారు. ఆయనపై ఎన్నో బాధ్యతలు ఉన్నాయని వాటిలో రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ ఉక్కు పురోభివృద్ధి, రైల్వే జోన్ ఏర్పాటు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రధానంగా ఉన్నాయన్నారు. వీటి కోసం కేంద్రాన్ని ఒప్పించి ఈ పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అలాగే వీటితోపాటు ఎన్నికల హామీలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇవి చేయడానికి రాష్ట్ర ప్రజలు ఆయనకు సహకరించాలని అందుకు అనుగుణంగా మీడియాతో పాటు రాజకీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షించే మాజీ ఎమ్మెల్యే గా అలాగే ఓ పారిశ్రామిక వేత్తగా ఆ విధానాన్ని తాను కోరుకుంటున్నానని డి వై దాసు తన ప్రకటనలో స్పష్టం చేశారు.



## వడ్డెల్లి సాంబశివరావుకు ఉదయభాను పరామర్శ

**నందిగామ, జనవరి 31, మేజర్ న్యూస్:** పట్టణం లోని టిడిపి నేత, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు వడ్డెల్లి సాంబశివరావు సతీమణి సరోజినీ దేవి ఇటీవల మరణించారనే విషయం తెలుసుకున్న జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను వడ్డెల్లి సాంబశివరావు స్వగృహమునకు వెళ్ళి వారిని పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ ప్రణాళికలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఏపీలో బీసీల అభివృద్ధికి 896.79 కోట్ల నిధులు విడుదలపై ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్"కు బీసీ నాయకులు మచి లీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు కృత జ్ఞతల తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గడ్డంరా జు మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ను నిర్వీరం చేసిందని గడిచిన ఐదేళ్లలో చేతి వృత్తి దారులైన బీసీ కుటుంబాలకు వైసీపీ ప్రభుత్వం మొండి చేయి చూపిందని,గడ్డంరాజు తెలిపారు.బీసీలకు స్వయం ఉపాధి రుణాలు అందించి బీసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా చేయూతనిస్తుందని, అందులో భాగంగానే 2024 -2025 ఆర్థిక సంవత్సరానికి 896.79కోట్లు విడుదల చేసిందని ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహకారాన్ని బడుగు బలహీన వర్గాలు సద్వినియోగ పరుచుకోవాలని గడ్డంరాజు తెలిపారు.

## విఘ్నేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ. 4.17లక్షలు



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలోనీ హుండీలను దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం ఉదయం తెరిచి కానుకుల రూపంలో భక్తులు చెల్లించిన నగదును లెక్కిం చారు. గత అక్టోబరు 15 నుంచి శుక్రవారం వరకు(3నెలల 17రోజులు) ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో, భక్తులు, ఉద్యోగులు చేసిన లెక్కింపులో 4,17, 814 లక్షలు ఆదాయం వచ్చినట్టు దేవస్థానం ఈవో యార్లగడ్డ వాసు, ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్ తెలియ జేశారు. దేవస్థాన అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందిం చాలని, ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఉయ్యూరు సుధాకర్, కమిటీ సభ్యులు లోయ వాసు, పంచగుమర్తి శ్రీనివాసరావు, విక్కుర్తి పోతురాజు, శలంకాయల లీలాకుమారి, వీరమాచనేని శైలజ, ఎరిక పాటి సుశీల, గుడివాడ హేమ కోలాట బృందం, ఉయ్యూరు బాబురావు సేవాబృందం, కానుమోలు గ్రామ సేవా భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు..

## రహదారుల నాణ్యతను పరిశీలించిన సర్పంచ్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ శివారు పాత కోటలో నిర్మిస్తున్న సిసి రహదారు లను గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ శుక్రవారం పరిశీలిం చారు. పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మానంద బాబు రహదారి నాణ్యత విషయంలో రాజీ పడకుండా పటిష్టంగా నిర్వహించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ. మండలి పవన్ .గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కిటకిటలాడిన సబ్ రిజిస్టర్ కార్యాలయం








**కంచికచర్ల జనవరి 31 మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 1 శనివారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా స్థిరాస్తులైన పొలాలు,స్థలాల రిజిస్ట్రేషన్ ధరలు పెరుగుతున్నందున రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారితో కంచికచర్ల రిజిస్టర్ కార్యాలయం శు క్రవారం ఉదయం 8 గంటల నుండి కిటకిట లాడింది. పొలాల రిజిస్ట్రేషన్ వేల్యూషను ఫిబ్రవరి ఒకటి నుండి రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం పెంచుతూ జీవో జారీ చేసింది. ఎన్నో ఏళ్లుగా రిజిస్ట్రేషన్ చేసుకోని వాళ్లు అలానే పొలాలు బదిలీ చేసుకోని వాళ్ళు ధరలు పెరుగుతున్నందున గురు, శు క్రవారం స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం రిజిస్ట్రేషన్ కు వచ్చిన ప్రజలతో తీవ్ర ఒత్తిడిగా ఉంది కాగా సర్వర్ పనిచేయటం లేదని సిబ్బంది తెలిపారు కావున రిజిస్ట్రేషన్లు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈరోజు లోగా రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పాత ధర వర్తిస్తుంది, కనుక ప్రజలు రిజిస్ట్రార్ కార్యాలయంలోనే పడిగాపులు పడుతున్నారు.

# నవ్వుల నాగేశ్వరావు దంపతులకు ఘన సత్కారం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాగోలు గ్రామపంచాయతీలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తూ నేడు పదవి విరమణ చేసిన అరజా నాగేశ్వరావు, శేషు కుమారి దంపతులకు ఘన సత్కారం చేశారు. పాగోలు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎండిఓ వెంకటరమణ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన నాగేశ్వరరావు అధికారుల అనధికారుల మనలను పొందాలని ప్రశంసించారు. తాను ఏ గ్రామంలో విధులు నిర్వహించినప్పటికీ ఇంటి పన్ను వసూళ్లలో నూరు శాతం మార్కు దాటేవారని అభినందించారు పంచాయతీ అధికారులకు పాలకవర్గ సభ్యులకు చేదోడువాదోడుగా ఉంటూ అందరికీ చేత నవ్వుల నాగేశ్వరరావు గా గుర్తింపు పొందారు అని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్, సభాధ్యక్షులు తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పాగోలు పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అరజా నాగేశ్వరరావు తనకు పూర్తి సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి పిట్ట రాంబాబు మాట్లాడుతూ ఇంటి పన్ను వసూలు నిమిత్తం గ్రామంలో తిరిగేటప్పుడు పంచాయతీ పరిధిలో తన దృష్టికి వచ్చిన సమస్యలను సర్పంచ్ కార్యదర్శులకు తెలియజేసి వాటి పరిష్కార దిశగా కృషి చేసివారిని సహకారం అందించేవారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాజులపాటి కళ్యాణి, ఈవోపీఆర్డి రవిశంకర్, రిటైర్డ్ ఈ ఓ ఆర్ డి దాసి సీతారామరాజు, చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పి. మాధవేంద్రరావు, గ్రామ ప్రముఖులు మేక కమలాకరరావు, వేమురి రమేష్ బాబు, మల్లంపల్లి శివరామకృష్ణ, పెనుముడి శ్రీనివాసరావు, మేక వెంకటేశ్వరరావు, మేక శ్రీనివాసరావు లతోపాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు





**సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, పదవి వీరమణ పొందడం అభినందనీయం.**

**ఇన్ని రోజులు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారు, మనమంతా ఒకే పోలీసు కుటుంబం.**

**పోలీసు డిపార్ట్మెంట్ లో ప్రజా సేవకే మీ సమయం, శక్తి అన్ని వినియోగించినందుకు డిపార్ట్మెంట్ తరపున ధన్యవాదాలు**





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా నగర పోలీస్ కమిష నరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి శు క్రవారం పదవీ విరమణ చేసిన ఆరుగురు పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు పోలీస్ కమీషనర్ వారి కార్యాలయం నందు అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి సరిత, పోలీస్ అధికారులతో కలిసి సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవ లు అందించినందుకు గాను పదవీ విరమణ చేసిన అధికారులను అభి నందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలి కారు. పదవీవిరమణ పొందిన వారు సి.టి.ఎఫ్. అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్ ఆర్.రామచంద్ర రావు, అసిస్టెంట్ సబ్ఇన్స్పెక్టర్ మాచవరం ఎం.వి.రమణ, జగ్గయ్యపేట అసిస్టెంట్ సబ్ఇన్స్పెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వం రావు, సి.సి.ఎస్.హెడ్ కానిస్టేబుల్ జె.దుర్గారావు, హోంగార్డులు యూనిట్ జి దుర్గారావు, ఎ.రజిని ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, ట్రైనీ డి.ఎస్.పి.సునీత , ఆర్.ఐ.లు శ్రీనివాసరావు, సుధాకర్ రెడ్డి , ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సోమయ్య, అసోసియేషన్ సంఘ సభ్యులు, అధికారులు, సి.పి.ఓ. సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కబేళాను మరింత అభివృద్ధి చేయండి









**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కబేళను మరింత అభివృద్ధి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఎంజీ రోడ్, కబేళ, వైవిఆర్ ఎస్టేట్, అజిత్ సింగ్ నగర్ ప్రాంతాలన్ని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కబేళాను మరింత అభివృద్ధి చేయాలని, కబిలాలు కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం పరుచుకోవాలని, నిత్యం వ్యర్థ నిర్వహణ చేస్తుండాలని అన్నారు. 58వ డివిజన్లో గల వైవిఆర్ ఎస్టేట్లో నిర్మాణం దశలో ఉన్న 1500 కిలో లీటర్ల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ ను పరిశీలించారు. అమృత్ పథకం 2.0 లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ కూడా దానికనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. అజిత్ సింగ్ నగర్ లోని అన్న క్యాంటీన్ పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చూసుకోవాలని అన్నారు. తదుపరి ఎంజీ రోడ్డులోని పారిశుధ్య నిర్వహణ పరిశీలించి పారిశుధ్య నిర్వహణలో



ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలి అని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీస్ డాక్టర్ సురేష్ బాబు, సుప్రింటెంటింగ్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







# ఎస్ సి సబ్ క్లాసిఫికేషన్ పై, వన్మమాన్ కమిషన్ చైర్మన్ పర్యటన



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ఎస్సీ సబ్ క్లాస్సిఫికేషన్ రిజర్వేషన్ విధానాల ప్రయోజనాలను సమానంగా పంపిణీ చేయడానికి ప్రత్యేకమైన సిఫార్సులను సూచించేందుకు ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా (రిటైర్డ్)ని వన్ మాన్ కమిషన్‌గా నియమించింది. ఈ కమిషన్ అనేక అంశాలను పరిశీలించి, రాష్ట్రంలోని పలు ఉప వర్గాల సంక్షేమాన్ని పరిరక్షించేలా స్పష్టమైన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించనుంది. అందులో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రతో కలిసి రెల్లిస్ కాలనీ ప్రజలను, అంగన్వాడి, హై స్కూల్, స్వయం సహాయక బృందాల జీవనోపాధిని పరిశీలించారు. వన్ మాన్ కమిషన్ గా వచ్చిన రాజీవ్ రంజన్ మిశ్రా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రతో కలిసి రెల్లిస్ కాలనీలో ఎస్ సి ప్రజలు నివసిస్తున్న ఇళ్లను, చేస్తున్న వృత్తులు అడిగి తెలుసుకున్నారు. తదుపరి అంగన్వాడి స్కూల్ పిల్లలు వాళ్లకు అందిస్తున్న పోషకాహారాలు, వారి ఎత్తు బరువు, అంగన్వాడీలో కల్పించిన వసతులు పరిశీలించారు. తదుపరి స్వయం సహాయక బృందమైన సాయినాథ గ్రూప్ వారు తయారు చేసిన ఉత్పత్తులను వాటి ద్వారా వారికి కలుగుతున్న ఆర్థిక అభివృద్ధి, ప్రభుత్వం వారికి కనిపిస్తున్న రుణ సదుపాయం వంటి విషయాలను పరిశీలించారు. తదుపరి పటమట లోని



జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రధాన ఉపాధ్యాయురాలు తో మాట్లాడి చదువుతున్న ఎస్ సి పిల్లల జనాభా, వారి పురోగతి వారికి కల్పిస్తున్న భోజన వసతులు అడిగి తెలుసుకున్నారు. 9వ తరగతి పిల్లలతో వారు చదువుతున్న పాఠ్యాంశాన్ని చెప్పమని వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్







## ధర్మాన సతీష్ కు పలువురి ఘన నివాళులు




**నందిగామ, జనవరి 31, మేజర్ న్యూస్:** పట్టణం లోని బైపాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన పట్టణ ప్రజలకు సుపరిచితుడు ధర్మాన సతీష్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సతీష్ మృతదేహానికి ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయ భాను, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సతీష్ మిత్ర బృందం, పట్టణ ప్రముఖులు తదితరులు హాజరై నివాళులర్పించారు. అశోక్ నగర్ స్వగృహం నుండి సతీష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో భారీ బాణాసంచా, ర్యాలీతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్ మిత్రబృందం పారుపల్లి దుర్గ, వడ్డెల్లి శ్రీనివాసరావు, హైదరాబాద్ భాను, కొండూరు వెంకటరమణ, మస్తాన్, రాజశేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మకి విశేష పూజలు



**కంచికచర్ల జనవరి 31 మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవతకు ఆర్యవైశ్య మహిళలు ఉదయం నుండి పంచామృతాలతో అభిషేకాలు, విశేష పూజలు మరియు హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు లక్ష్మీ సహస్రనామం,విష్ణు సహస్రనామం, జై వాసవి జై జై వాసవి నామాలతో అమ్మవారి దేవస్థానం మారు మోగింది. అమ్మవారిని పూలతో సారే చీరతో ఎంతో అందంగా అలంకరించారు ,వందలాదిమంది ఆర్యవైశ్యులు ఇతరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పండ్ల రసాలను సమర్పించారు. కొంతమంది మహిళలు అమ్మవారికి చీరలు బహుకరించారు. అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవం రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినందుకు కంచికచర్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు దొడ్డా మోహన్ రావు, దివ్వెల ప్రసాద్, దొడ్డా నాగరాజు, పవన్, వాసవి యువసేన నాయకులు జూలూరు విశ్వనాథం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

## కోసూరులో అగ్నిప్రమాదం



**మొవ్వ (జనవరి 31) మేజర్ న్యూస్:** గ్యాస్ బండ లీకై ఏడు పురిల్లు అగ్నికి ఆహుతి అయిన సంఘటన మండల పరిధిలోని కోసూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. మొవ్వ అగ్నిమాపక అధికారి కే వెంకటేశ్వరరావు అం దించిన వివరాల మేరకు కోసూరు గ్రామంలో భోగేం సోవమ్మ, నల్లబోతుల రావులమ్మ, భోగేం కోటమ్మ, ఆవుల పెద్ద అంకమ్మ, ఆవుల వీరమ్మ, భోగేం. పుట్టలమ్మ, భోగేం. జయశ్రీ, ఆవుల కుమారి లకు చెందిన ఏడుళ్ళు అగ్నికి ఆహుతి అయినట్లు మొవ్వ అగ్నిమాపకాధికారి కే వెంకటేశ్వరరావు తెలిపా రు. అగ్ని ప్రమాదంలో మూడు లక్షల ఆశిస్తా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు అగ్ని బాధిత కుటుంబాలకు కుటుంబాలను స్థానిక తహసిల్దార్ కే మస్తాన్ పరామర్శించి బాధిత కుటుంబాలకు వస్తువులు కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కే రమేష్, స్థానిక వీఆర్వో నవీన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎం ఎన్ ఎస్ మూర్తి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ శాఖల్లో సమాచార శాఖ అధికారుల పాత్ర కీలకం





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధైన సమాచార శాఖలో పనిచేసే అధికారులు,సిబ్బంది సేవలు అత్యంత కీలకమని.. సుదీర్ఘకాలం పాటు సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి డివిజనల్ పీఆర్వోగా పదవీ విరమణ చేసిన సుంకర శ్రీనివాసరావు అందించిన సేవలు నేటితరం అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ కృష్ణా జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డివిజనల్ పీఆర్వోగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన సుంకర శ్రీనివాసరావు దంపతులను శుక్రవారం జిల్లా కలెక్టర్ బాలాజీ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించి వాటి ఫలాలు ప్రజలకు చేరువచేయడంలో సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు,సిబ్బంది సేవలు ఎంతో కీలకమైనవన్నారు. రాష్ట్ర,జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల పర్యటనల సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందిస్తూ వారిని సమన్వయం చేసుకుంటూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించడంలో నిరంతరం సమాచార శాఖ అధికారులు, సిబ్బంది ఎంతో సమర్థవంతమైన సేవలు అందిస్తారన్నారు. అలాంటి శాఖలో 38 ఏళ్లపాటు వివిధ హోదాల్లో అత్యుత్తమ సేవలందించి ఉన్నతాధికారుల మన్ననలు పొందడంతో పాటు పనిచేసిన శాఖకు వన్నె తీసుకొచ్చిన సుంకర శ్రీనివాసరావు సేవలను నేటితరం అధికారులు, సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

అవకాశం ఉంటే భవిష్యత్తులో సుంకర శ్రీనివాసరావు సేవలను వినియోగించుకునేందుకు తనవంతు కృషిచేస్తామన్నారు. జిల్లాలో నిర్వహించే ముఖ్యమైన కార్యక్రమాల సమయంలో సుంకర శ్రీనివాసరావు స్వచ్ఛందంగా వారి సేవలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. తొలుత జిల్లా కోర్టు సెంటర్‌లో గల విజయశ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించిన శ్రీనివాసరావు అభినందన వీడ్కోలు సభలో డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వోలు జి.రాజేష్, కె.రవి, ఏఈఐఈ జె.శ్రీనివాసరావు, ఏవీఎస్ వేమూరి ప్రసాద్, పబ్లిసిటీ అసిస్టెంట్ బి.బాలాజీ, సీనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొని సుంకర శ్రీనివాసరావు సేవలను కొనియాడి అభినందించారు.

# ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ




**పెడన,మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తూ జీవో విడుదల చేసి ఆర్యవైశ్యుల ఎనలేని ఘన కీర్తిని ఆర్యవైశ్యులకు అందించటమేనని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు శ్రీ వాసవి క్షేత్రంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి సేవాదళ్, వాసవి క్లబ్, శ్రీ వాసవి మహిళా మండలి తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నియోజకవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, కు పట్టణ ఆర్యవైశ్య సంఘం తరపున ఆలయ మర్యాదలతో ఘనంగా పూర్ణకుంభంతో స్వాగతం చారు. అనంతరం అమ్మ వారికి ప్రత్యేక పూజలు, పాలా భిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లూరి చిన్నా మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును నెల్లూరు జిల్లాకు పెడుతున్నామని 2002 సంవత్సరంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు అని, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పొట్టి శ్రీరాములు వర్ధంతిని, ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తూ జీవో విడుదల చేసి ఆర్యవైశ్యుల ఎనలేని ఘన కీర్తిని అందించటాన్ని హర్షిస్తున్నామన్నారు. అనంతరం ఆలయంలో హోమాలు యజ్ఞ యాగాదులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నియోజవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావును దృశ్యాలవాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి రాధాకృష్ణ గుప్తా, జవాజి నాగు, కోడూరు రమేష్, సభ్యులు గుర్రం నారాయణ, మామిడి నరసింహారావు, కొమ్మూరి సుధారాణి, ఆలపాటి లక్ష్మి, మామిడి సావిత్రి, కొమ్మూరి విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేశారు. దివ్యాలంకరణ అనంతరం పంచహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుడివాడ మెహెర్ ప్రకాష్-వెంకట శేష కళ్యాణి దంపతులు వాసవి హోమం, పూర్ణాహుతి, నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పాల అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం మహిళల జ్యోతుల నడుమ అమ్మవారి ఊరేగింపు పురవీధులలో అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సామా లక్ష్మి కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవ రావు పర్యవేక్షించారు.

## ఘనంగా వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



**మొవ్వ మేజర్ న్యూస్ :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం మండల కేంద్రమైన మొవ్వ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మూడు గంటల వృద్ధ దంపతులకు షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించి గోమాతకు సీమంతం చేశారు. సందర్భంగా నిర్వ హించిన క్విజ్ పోటీల్లో విజేత లైనవారికి బహుమతులు, జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు..



# పేదలకు అండగా దేవాంగ సంక్షేమ సంఘం

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



**పెడన, మేజర్ న్యూస్ :** పేద దేవాంగ ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అన్నారు. ఈ మేరకు పెడన పట్టణానికి చెందిన 13వ వార్డులోని మఠం వీధిలో నివాసం ఉంటున్న బట్ట జ్ఞాన పూజ అనే నిరుపేద విద్యార్థినికి సంఘం తరఫున 1.5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ రెండు నెలల క్రితం ఆటోలో ప్రయాణిస్తుండగా అనుకోకుండా దురదృష్టకరమైన జ్ఞాన పూజ అనే నిరుపేద విద్యార్థికి యాక్సిడెంట్ జరిగి ప్రమాదంలో పూజ కుడి కాలు బాగా చిద్రమైన నేపథ్యంలో ఆమెకు రెండుమూడు మేజర్ ఆపరేషన్లు చేయాలని డాక్టర్లు సూచించారు. ఆపరేషన్కు లక్షలలో ఖర్చు అవుతుందని వారు తెలిపారు. బాధిత విద్యార్థిని తల్లి చేనేత మగ్గంపై నేత నేస్తూ, ప్రభుత్వం నుండి ఏటువంటి సహాయము లేకుండా కుమార్తెను చదివిస్తున్న ఆమె తల్లికి లక్షల రూపాయలు తెచ్చి ఆపరేషన్ చేయించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు అన్నారు . ఈ నేపథ్యంలో పెడన దేవాంగ యూత్ వారు ఈ సమాచారాన్ని దేవాంగ సంక్షేమ సంఘం దృష్టికి తీసుకువెళ్లగా రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వరరావులు సమాలోచన చేసి అధ్యక్షులకు తెలిపారు. అనంతరం ఆ సమాచారాన్ని వాట్సాప్ గ్రూపులలో పెట్టగా అందులో నుంచి సేకరించిన విరాళం మొత్తం 1,50,558/- రూపాయలను శుక్రవారం సంఘ అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చేతుల మీదగా ఆ విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేద దేవాంగ ప్రజలకు రాష్ట్ర సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాంగ పెద్దలు, మాజీ మున్సిపల్ చైర్మన్ భండారు ఆనంద్ ప్రసాద్, బుసం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్-బాపట్ల జిల్లా దేవాంగ సంఘం, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అసోసియేటెడ్ ప్రెసిడెంట్-బండ్ల బాబు, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి-యారాసు అరుణ్ బాబు, చల్లా విజయ్ గారు-బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం సెక్రటరీ, ఛప్పరం మల్లికార్జున రావు, పడవల మోహన త్రినాధ్, కొసనం శ్యామల రావు, బండారులంక నుండి పిచ్చుక శ్యామ్, బల్ల వెంకటేశ్వరరావు, చింతపల్లి సత్యనారాయణ, బల్లా కిషోర్, ఇనుమర్తి లింగమూర్తి , గుత్తి సదాశివరావు, పెడన దేవాంగ యూత్ సేవా సమితి సభ్యులు వుటుకూరు సుధీర్, కాకర్ల కోటయ్య తదితరులు పాల్గొన్నారు..




## ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం.

**గన్నవరం, జనవరి 31, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గన్నవరం వాసవి నగర్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థన మందిరంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లపోతు ఫణి కుమార్, అనిలా దంపతులు అమ్మవారికి కిరీటం బహుకరించినారు. అనంతరం ఆలయంలో అమ్మవారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థన మందిరం ప్రెసిడెంట్ కందగడ్డల కృష్ణారావు, వాసవి మిత్ర గన్నవరం ప్రెసిడెంట్ కందగడ్డల నాగ రాము, మడుపల్లి బాలకృష్ణారావు, గోంట్ల బాల శంకర్, గోంట్ల యజ్ఞ నారాయణ, శ్రీకాకుళపు సాయి, అనిల్, జితేంద్ర, లక్ష్మణ్, తాడికొండ పవన్, సాగర్, పృధ్వి, గోపేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**గన్నవరం, జనవరి 31, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో.. 33/11కేవీ వీరపనేనిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో లైన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును. ఈ రోజు ఉదయం 8 గంటల నుంచి 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు వీరపనేనిగూడెం, ఏపీఐఐసి ఇండస్ట్రియల్ ఏరియా , తెంపల్లి, మర్లపాలెం హౌసింగ్ కాలనీ, బల్లిపర్రు, మెట్లపల్లి ప్రాంతాలలో సరఫరా నిలిపివేయబడును. కావున గృహ వినియోదారులు, వ్యాపార వినియోగదారులు, వ్యవసాయ వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.



## అధికారిక కార్యక్రమంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణం

### సమాజంలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

**గన్నవరం, జనవరి 31, మేజర్ న్యూస్ :** ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణం సందర్భంగా శుక్రవారం రామవరప్పాడు లోని శ్రీ వెంకమ్మ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలో ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ వాసవి పేరంటాలమ్మ వారికీ పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమలను సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు. సమాజంలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని రాష్ట్ర అభివృద్ధిలో, ఉద్యోగాల కల్పనలో ఆర్యవైశ్యుల పాత్ర శ్లాఘనీయమని అన్నారు. గత ప్రభుత్వం ఆర్యవైశ్యుల మనోభావాలను దిబ్బతిస్తే కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా ఆర్యవైశ్యులకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ లో వాసవి అమ్మవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు ప్రతి నియోజకవర్గంలో అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో హిందూదేవాలయాల పై దాడులు జరిగాయని, రథాలు కూడా దగ్ధం చేసారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తూ అందరి మనోభావాలు కాపాడుతుందని ఎమ్మెల్యే యార్లగడ్డ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెకు ఇచ్చుటకు బహిరంగ వేలం

**నందిగామ, జనవరి 31, మేజర్ న్యూస్:** వ్యవసాయ మార్కెట్ కమిటీ, నందిగామ మార్కెట్ యార్డు పర్సన్ ఇన్ చార్జ్ వారి ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, విజయవాడ వారి సమక్షంలో ఎన్.హెచ్. 65 రోడ్డుకు అభిముఖంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్సోలో గ్రౌండ్ ఫ్లోర్ నందు షావు నెం. 1,2,6,9 లు మరియు ఫస్ట్ ఫ్లోర్ నందు షాపు నెం. 10 నుండి షావు నెం. 17 వరకు వెరశి మొత్తం 12 షావులు అద్దెకు ఇచ్చుటకు ది. 06.02.2025 న ఉదయం గం. 11 ని.లకు బహిరంగ వేలం నిర్వహించబడును. షావులు వేలం పాటలో పాల్గొనదలచిన వారు ది. 05.02.2025 సాయంత్రం గం. 5 ని.ల లోపు రూ.10,000/- లు ( అక్షరాల పదివేల రూపాయలు) బ్యాంకు డి.డి ద్వారా ధరావత్తు చెల్లించగలరు. వేలం పాట నియమ నిబంధనలకు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.




## వైభవంగా కన్యకాపరమేశ్వరీ వారి పల్లకీసేవ, కలశజ్యోతి

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం చల్లపల్లిలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావుల ఆధ్వర్యంలో శ్రీఆర్యవైశ్యసంఘ భవనంలో కార్యక్రమం ప్రారంభమైంది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి చిత్రపటానికి పూజలుచేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో చేపట్టిన కలశజ్యోతి ప్రదర్శన, యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉత్సవ విగ్రహ పల్లకీసేవను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. పురవీధుల్లో ఆధ్యాత్మిక భరితంగా కలశజ్యోతి, పల్లకీసేవ సాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఆర్యవైశ్యసంఘ నేతలు జల్లూరి ప్రసాద్, కొల్లిపర సాంబశివరావు, తమ్మన సతీష్కుమార్, దింటకుర్తి జ్యోతి, ఉరిమి మణికాంత్, కొల్లిపర నళిని వరలక్ష్మి, చెన్నగిరి సుజాత, తమ్మన సాంబశివరావు, దేసు సుధాకర్, మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, వరదా రాజశేఖర్ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రూ.700కోట్ల బకాయిలను తీర్చింది




**గుడివాడ, మేజర్ న్యూస్:** వైసీపీ పెట్టిన ఫీజురియంబర్స్మెంట్ బకాయిల్లోనే రూ. 700 కోట్లు కూటమి ప్రభుత్వం తీర్చిందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి తెలిపారు. గుడివాడ టీడీపీ కార్యాలయంలో సత్యసాయి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 5న వైసీపీ చేపట్టే ఫీజు పోరు కార్యక్రమం పోస్టర్ను వైసీపీ ముఠా అంత కలిసి విడుదల చేశారన్నారు. గతంలో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ని విద్యా దీవెనగా మార్చి కొత్తగా ఈ పథకాన్ని సృష్టించినట్లు జగన్ ప్రచారం చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.700కోట్ల బకాయిలు తీర్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత సభ్యులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగురావు పాలెంలో ఆర్.సి.యం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తెలుగురావుపాలెం ఆర్.సి.ఎం చర్చ్ లో వార్షికోత్సవం కూచిపూడి ఫాదర్ పులిపాక జాకప్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆది ఆంధ్ర ఫీల్డ్ సంఘ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, జనసేన నాయకులు సుగ్గన పవన్ కుమార్, శ్రీనివాస్, గ్రామస్తులు, విశ్వాసులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండో రోజూ కొనసాగిన ఎమ్మెల్యే ప్రజాభిప్రాయ సేకరణ



**బంటుమిల్లి రోడ్డు, ఓల్డ్ బైపాస్ రోడ్ ఏరియా, పంచవటి కాలనీలో ద్విచక్ర వాహనంపై పర్యటించిన ఎమ్మెల్యే.**

**ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే రాము**

**గుడివాడ, మేజర్ న్యూస్:** ప్రజాభిప్రాయ సేకరణకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గుడివాడ నియోజకవర్గంలో చేపట్టిన యాత్ర రెండో రోజు కూడా కొనసాగింది. ఎమ్మెల్యే ద్వీచక్ర వాహనంపై శుక్రవారం బంటుమిల్లి రోడ్డు, ఓల్డ్ బైపాస్ రోడ్ ఏరియా, పంచవటి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పంచవటి కాలనీవాసులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరగా సచివాలయ కార్యదర్శులు, ఆర్‌ఓబి ఇంజనీర్లకు వెంటనే ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి ఆదేశించారు. బంటిమిల్లి రోడ్డులోని ఫిష్ మార్కెట్ మహిళలతో మాట్లాడి ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలతో నేరుగా ముఖాముఖిగా కలిసేందుకే పర్యటిస్తునట్టు ఎమ్మెల్యే చెప్పారు.



# స్పందనలో రఘు చరణ్ వల్లంకొండ జన్మదినోత్సవం




**గన్నవరం, జనవరి 31, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా గన్నవరం మండలం దావాజిగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రం (వికలాంగుల పాఠశాల) లో శుక్రవారం ఐర్లాండ్ లో ఉంటున్న ప్రవాస భారతీయుడు రఘు చరణ్ వల్లంకొండ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సెక్రటరీ సంకాబత్తుల రజిత మాట్లాడుతూ ప్రవాస భారతీయుడు ఐర్లాండ్ దేశంలో ఉంటున్న రఘు వల్లంకొండ స్పందన మానసిక వికాస కేంద్రం దివ్యాంగుల మధ్యలో జరపడం ఎంతోమంది కి ఆదర్శమని ఆమె అన్నారు.రఘు చరణ్ విదేశాలలో ఉన్నప్పటికీ సొంత గడ్డపై ఉన్న మమకారంతో సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం మానవత్వానికి నిదర్శనమని రజిత వెంకట్ అన్నారు. స్పందన లో పది సంవత్సరాల నుండి మానసిక దివ్యాంగులకు ఉచితంగా విద్యా, వైద్య, రవాణా బోజన సౌకర్యాలు అందించడం జరుగుతుందని మరిన్ని సేవా కార్యక్రమాలు చెయ్యటానికి రఘు చరణ్ లాంటి వారు ముందుకు వచ్చి తోడ్పాటు అందించినట్లు అయితే మరిన్ని సేవలు చెయ్యగలమని రజిత వెంకట్ ఆకాంక్షించారు. అనంతరం స్పందన బాలలకు భోజన నిమిత్తం 10,500 రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, బిర్యానీ విందు, కేకు, స్వీట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా రఘు వల్లంకొండ కి మారుతి ఎలక్ట్రికల్ అధినేత రాంబాబు పవన్ ( నాని) లకు సంస్థ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పెరిగిపోతున్న కుక్కల, కోతుల బెడద



**భయాందోళన చెందుతున్నా మహిళలు విద్యార్థులు**

**పట్టించుకోని మున్సిపల్ పంచాయతీ అధికారులు**

**నందిగామ, జనవరి 31, మేజర్ న్యూస్:** నందిగామ పట్టణం, మండలంలోని పలు గ్రామాలలో కుక్కలు కోతుల బెడద రోజు రోజుకు పెరిగి పోతుంది. పట్టణంలో అయితే కుక్కల గుంపు 30 కు తక్కువ కనబడడం లేదు. గ్రామాల్లో కోతుల బెడద మామూలుగా మనుషులపై దాడి చేతికొచ్చిన పంట పొలాలను నాశనం చేస్తున్నాయి.ఈ క్రమంలో స్కూల్ ఎలిమెంటరీ స్కూల్ ల లో తమ పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు వెంట ఉండాల్సిందే. మహిళలు ఇళ్లల్లో పని చేసుకునే క్రమంలో కోతులు ఇళ్లల్లోకి చొరబడి మహిళలను వృద్ధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మరి ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రతి వీధిలోను 10 నుంచి 20 కుక్కలు స్వేర విహారం చేస్తున్నాయి. రాత్రి సమయంలో వివిధ ప్రాంతాల నుంచి విధులు ముగించుకొని లేక ప్రయాణం చేసి తమ స్వగృహాలకు వెళ్లే క్రమంలో మందలు మందలుగా ఉన్న కుక్కలను చూసి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గాంధీ సెంటర్ నుంచి బీసీ కాలనీ ప్రాంతంలో మరీ ముఖ్యంగా రోడ్లపైనే కుక్కల ఆవాసాలుగా మారాయి. సంబంధిత పంచాయతీకి ఎన్ని సార్లు మొరాయించుకున్న తమ గోడు పట్టించుకునే నాధుడే లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటికి మొన్న రెండేళ్ల చిన్నారిపై పెనుగంచిప్రోలు గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిన విషయం విధితమే. కాబట్టి సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టవలసిందిగా పట్టణవాసులు, గ్రామస్తులు కోరుతున్నారు.





## పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలి.

**కృత్తివెన్ను జనవరి 31 మేజర్ న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులు అందరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని పల్లిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు కొప్పునీడి సూర్యప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొమాళ్ళపూడి, నీలిపూడి, పల్లెపాలెం, ఇంతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సుమారు 60 మంది విద్యార్థులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్ తన సోదరుడు అయిన ప్రముఖ ఇండస్ట్రియలిస్టు గరగ శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఎంఇఓ 2 ఎస్ ఎస్ డి వి ప్రసాదరావు, పలువురు ప్రధాన ఉపాధ్యాయులు,ఉపాధ్యాయులు, సి ఆర్ పి లు సోమశేఖర్,తంబి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు సమావేశం



**గూడూరు మేజర్ న్యూస్ :** మల్లవోలు ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తరువాత మల్లవోలు గ్రామానికి చెందిన అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాథ్ ఇంటి వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో 16.02.2024 ఆదివారం విజయవాడలో జరుగుతున్న నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం గురించి చర్చించారు. ఇంకా రాష్ట్రంలో ఉన్నటువంటి దేవాంగులు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా బలపడడానికి ఏ రకమైనటువంటి కార్యక్రమాలు చేపట్టాలని దానిపై కూడా చర్చలు జరిగినాయి ఈ కార్యక్రమంలో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు అనంత ప్రసాద్, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి శెట్టి శివ శంకరయ్య, ఏ రాజు, అరుణ బాబు, బాపట్ల జిల్లా దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి బండ్ల బాబు, బాపట్ల జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బాపట్ల జిల్లా బల్ల వెంకటేశ్వరరావు, బండారులంక దేవాంగ సంఘం అధ్యక్షులు ఊటుకూరు సుధీర్ తదితర దేవాంగ ప్రముఖులు పాల్గొన్నారు.

## వడ్డెల్లి సాంబశివరావుకు సామినేని పరామర్శ



**నందిగామ, జనవరి 31, మేజర్ న్యూస్:** పట్టణంలోని టిడిపి నేత, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు వడ్డెల్లి సాంబశివరావు సతీమణి సరోజినీ దేవి ఇటీవల మరణిం చారనే విషయం తెలుసుకున్న జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయ భాను వడ్డెల్లి సాంబశివరావు స్వగృహమునకు వెళ్ళి వారిని పరామర్శించి తన సానుభూతిని తెలిపారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999